ఏమైనా నేరుగా మాచర్లనుండి గాని, డామ్ నుండి ఎత్తిపోతలకు బస్సులు లేకపోవుటచే ఆ ప్రయాణము చాలా కష్టము. ప్రభుత్వమువారి కుటీరము ఉంది. మొసళ్ళ పెంపకము కూడా ప్రారంభించిరి. ఎత్తిపోతలకు నేరుగా బస్సులు వేసి, హోటలు పెట్టించి సదుపాయములు చేసిన ఎంతో వెలుగులోనికి రాగలదు. ఏమైన అందరూ చూడదగిన అందాలసీమ ఎత్తిపోతల ప్రాంతం.

లంబాడీలు పెండ్లి వేడుకలు వంటివి రంగనాథస్వామి వారి ఆలయములో జరుపుకొనుచుందురు. త్రిభుజాకృతిలో యున్న అనేక రంగుల గుడ్డల వలన లంబాడీలు జరుపుకొనే పండుగులను తెలియజేస్తాయి. గణపతి, కుమారస్వామి, వీరభద్రాలయముల చిన్న చిన్న రూపములు యిప్పటికీ కనబడును. మహిషాసుర మర్ధని, భైరవాలయములు కూడా యుండెడివట. 1964 సం॥ సెప్టెంబరులో వచ్చిన నాగులేరు, చంద్రవంక నదుల వరదలు వల్ల ఈ రూపము దాల్చినవి అని అచ్చటివారు చెప్పుచుందురు.

ఎల్లప్పుడూ...
"ఎమరాల్డ్" బనియన్లనే ఉపయోగించండి.



26, Stanes Rd., 4th St.,
TIRUPUR - 638602
Regd. No. 300188

# ఆ వేనోళ్ళు!

* రచన : శ్రీ వేముల సత్యనారాయణ. *

గోడగడియారము 'ట్రింగ్, ట్రింగ్' మని ఆరుగంటలు మోగించటంతో తన బడిలో ఒరిగిన సత్యంను క్రిందికి దించి, నిద్రాదేవి తక్కున వెళ్ళిపోయింది. అతని రోజటి అలవాటు ఇదే! ఆరు గంటల లోపు 'తెలివి' ఉండదు, అటుపైన 'తెలివి' ఉండక ఉండదు.

కళ్ళు నులుముకొని ఒక్క ఆవులింతతో లేచికూర్చున్నాడు సత్యం. ఆ సవ్వడికి భర్త లేచినాడని గ్రహించి, స్టౌ వెలిగించబోతున్న రమ ఏదో మునిగిపోయినట్లుగా భర్త వద్దకు పరుగు పరుగున వచ్చి "ఏమండీ! ఇది విన్నారా?" అని అడిగింది.

"ఏదీ ఇప్పుడేగా లేచింది! ఏం సంగతేమిటి?" అడిగాడు రగ్గును తీసి వేస్తూ. రమ మెల్లగా భర్తకు చేరువగా వచ్చి రహస్యం చెబుతున్నట్టుగా "అదేనండీ! మన వీధిలోని రాఘవులుగారి అమ్మాయి లేచిపోయిందట!" అంది.

"అదో పెద్ద వింత అయినట్లు చెబుతావేమిటి? లేచి ఎటయినా పోకపోతే ఎప్పుడూ ఒకే స్థలంలో కూర్చుంటారేమిటి? ఇదిగో, ఇప్పుడు నేను లేచి... పోతున్నాను బాత్రూంకి" అన్నాడు సత్యం పడక గదినుండి బైటకు నడుస్తూ.

"అబ్బ! మీకన్నీ హాస్యాలే ఏమీ తెలియని అమాయకుల్లాగా ఫోజు పెట్టుట మీ కలవాటుగాని ఎవరో ఏవూరో నాకు తెలియదుగాని ఆ అమ్మాయి ఓ అబ్బాయితో లేచిపోయిందటండీ!" చెప్పింది రమ తాను చూసిన సినిమాలోని కుతూహల సన్నివేశాన్ని చెబుతున్నట్లుగా.

"ఓహో! అబ్బాయితో లేచి పోయిందా నీ బాధ? ఛ్ఛ ఛ్ఛ పిచ్చిపిల్ల అబ్బాయితో కాక ఓ అమ్మాయితో లేచిపోయుంటే ఇలా ఎవరికీ ఏ బాధా ఉండేది కాదు" తన మామూలు హాస్యధోరణిలో అన్నాడు సత్యం.

"అబ్బబ్బ! మీతో మాట్లాడడం నాకు చేతకాదు

# విఘ్నేశ్వర్



లోతు బావిల

## జెట్ పంపులు

★

భూమిలోని లోతు బావిలకు, మరియు పెద్ద బావిలకు అన్నింటికి సరిపోవును.

దీన్ని బావిలపై అమర్చవచ్చును. ఇప్పుడు 1 హెచ్. పి. నుంచి 5 హెచ్. పి. వరకు దొరకును.

తయారించువారు

శ్రీ విఘ్నేశ్వర్ ఇండస్ట్రీస్

పాపనాయకన్ పాలెం,

కోయంబత్తూరు - 641 037.


బాబూ! అసలు మీకు చెప్పడము కాదే బుద్ధితక్కువ" చిర్రుబుర్రులాడింది రమ.

సత్యం మందహాసం చేస్తూ లేకపోతే ఏంటి రమా! ప్రతిదానికి చెవులు కొరుక్కోవడమేనా? ఎన్నెన్నో అసలైన అక్రమాలు ప్రపంచంలో జరుగుతున్నా పట్టించుకోక, ఇలాంటి విషయాలు మాత్రము పెద్ద దోషమయినట్లు ముచ్చటించుకోవడము, వ్యర్థంగా విమర్శించుకోవడము అలవాటయిపోయింది చాలా మందికి. ఎగిరిపోయి ఎంచక్కా రిజిస్టర్ మేరేజి చేసికొని హాయిగా కాలం గడుపుతారు. వాళ్ళ గురించి నీకు బెంగెందుక్కాని త్వరగా కాఫీ పనిచూడు. ముఖము కడుక్కొస్తాను, అంటూ బాత్రూంవైపు వెళ్ళాడు సత్యం.

"హూఁ..." అంటూ నిట్టూరుస్తూ, ప్రేమనిరాకృత వ్యక్తిలా ముఖము చిన్న బుచ్చుకు వెళ్ళింది రమ వంటగదిలోకి.

పదిగంటలు కావడముతో "రమా! నే వెళ్తున్నా, తలుపేసుకో!" అంటూ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు సత్యం. జనరంజని పెట్టుకున్న త్రోవవెంబడి అన్ని రేడియోలలో ఒకే పాట వినిపించునట్లుగా మార్గమధ్యంలో అందరి నోటా అదే లేచిపోయిన పాట పలుకుతోంది. సత్యం ఆఫీస్‌కి వెళ్ళగానే తోడి గుమస్తాలందరు జీరో వాట్టు బల్బుల్లా ముఖాలు వెలిగించుకొని, నోళ్ళు ఇకిలించుకొని అతని చుట్టూ చేరారు. తనకు ప్రమోషన్ ఆర్డర్ గాని రాలేదు కదా! అనుకున్నాడు సత్యం. ఆ భాగ్యం తనకున్నదో? లేదో? నిర్ధారించుకోక ముందే సీతారాం "ఏమోయీ సత్యం, మీ వీధిలో అమ్మాయి మాయమైందట. ఏంటి కథ?" అన్నాడు మరింత ఇకిలిస్తూ. ఇదే విని విని విసుగెత్తి పోవడంతో సత్యంకు చిర్రెత్తుకపోయింది. అందుకే చిరాకుతో "గంగలో దూకింది అంతే!" అన్నాడు. "అయ్యో పాపం!" అన్నారు అందరూ కోరస్‌గా.

"మరి ఎవరు మాయమైతే మీకెందుకు. మంచి విషయాలు మాట్లాడుకోవడానికి చేత కాదు కాని ఇటువంటి విషయాలైతే తెలిసినా మరీమరీ అడిగి చెప్పించుకుంటారు" అన్నాడు సత్యం మరింత చిరాగ్గా. "హోఁ! దిగివచ్చాడు మరో మహాత్ముడు" అంటూ తమ సీట్లవైపు తిరిగి "ఈ నాటకములో ఇతని పాత్రకూడా ఉందేమో అని

సీట్లలో కూర్చుండి ఏ పుట్టలో ఏ పామున్నదో!" అంటూ రాగయుక్తంగా గొణుక్కున్నారు వారు.

* * *

ఆనాడు సత్యం ఆఫీస్‌లోనికి అడుగు పెట్టగానే గుమస్తా పరివేష్టితుడైనాడు. మళ్ళీ తమ వీధిలో ఏ అమ్మాయీ లేచి పోలేదు కదా? అలా జరిగితే అపరవార్తా పత్రిక రమ తప్పక తెలిపేది. ఏమిటో మరి? అని సత్యం ఆలోచిస్తుండగానే గుడ్ న్యూస్! క్రొత్త ఆఫీసర్‌గా వొచ్చారు. పేరు రామం అన్నారు తెచ్చిపెట్టుకున్న సంతోషంతో. ఓహో! అంత సంతోషంగా చెబుతుంటే ఆఫీసర్ మంచివాడే నన్నమాట అనుకొని అలాగా? అన్నాడు సత్యం. అవును! చాలా మంచివాడు. నిన్న సాయంత్రమే వచ్చాడు. తెలియగానే వెళ్ళాము. ఏ మాత్రం ఆఫీసర్ ననే గర్వం లేకుండా మాతో స్నేహ పూర్వకంగా మాట్లాడాడు అన్నాడు వెంకట్రావ్. ఇంతలో ప్యూన్ టిఫిన్లు, టీలు పట్టుకొచ్చాడు. సత్యం తీసికో అని అందరూ తలో ప్లేటు తీసికొన్నారు. ఎందుకండీ ఇప్పుడివన్నీ? ఇప్పుడేగా సుష్ఠుగా భోంచేసి వచ్చాము అన్నాడు సత్యం యీ అసాధారణమైన పరిస్థితికి కాస్త ఆశ్చర్యపడుతూ. ఫర్వాలేదు తీస్కోవోయి ఏదో సంతోష మనిపించి, ఇలా కలిసి తినాలనిపించింది అన్నాడు వెంకటేశ్వర్లు.

ఇక సత్యం అందరితో పాటు టిఫిన్ చేయడము ముగించి, టీ త్రాగుతుండగా అన్నట్టు సత్యం! మన ఆఫీసర్ గారి సతమణి ఎవరో తెలుసా? అన్నాడు గురవయ్య ఎవరన్నట్లుగా పశ్నార్థకంగా ముఖం పెట్టాడు సత్యం. రాధిక అంటే అదే మీ వీధిలోని రాఘవులుగారమ్మాయి అన్నాడు దొంగల స్థావరాన్ని కనుక్కున్న డిటెక్టివ్‌లా పోజు పెడుతూ. ఓహో! సత్యం కాస్త ఆశ్చర్యంగా. ఆ మరుక్షణమే వారి యీ సత్కారమెందులకో, తనతో ఈ నాడు అంత వినయంగా మాట్లాడుతున్న దెందుకో అర్థమయింది.

ఆనాడు సన్మానసభ ఏర్పాటు చేశారు, ఎన్ని

Grams: "SHIVAJITEX" Phone: 23616

ఎల్లప్పుడూ మీనమ్మికకు పాత్రమైన శివాజీ గుర్తు గలటవల్సునే వాడండి




టవల్స్.. బెడ్‌షీట్స్..

నేప్‌కిన్స్..కేన్వాసింగ్‌క్లాత్

T. MARIMUTHU
Handloom Weaving Factory
SELLUR, MADURAI - 625 002.

టి. మారిముత్తు
హేండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరి,
సెల్లూర్ :: మధురై - 625 002.

పాపాలు చేసినా సరే దేవుడికి ఉత్సవాలు చేయిస్తే, తీర్థ యాత్రలు సేవిస్తే ఒక అగ్గిపుల్లకు ఎండుటాకులు భగ్గున అంటుకొని మండినట్లు పాపాలన్నీ భస్మపటలం అవుతాయి అని శాస్త్రాలు ఎలుగెత్తి చాటుతున్నాయి కనుకనే అన్యాయాలు చేయడానికి పుట్టినస్తారు. మరి ఈ ఉత్సవాలకు దేవుడు సంతోషిస్తాడో, సంతోషించడో, పాపాలు ఉంటాయో పోతాయో తెలియదుకాని ఈ మనుషులకు చేసే సన్మానాలు మాత్రం మంచి ఫలితాలనే ఇస్తాయి. అందుకే ఆనాటి సాయంకాలం ఆదర్శదంపతులు "రాధికా రామం" అనే ప్రకటనతో వారికి సన్మానసభ ఏర్పాటు చేశారు.

వారిది ఆదర్శ వివాహమనీ, ప్రస్తుత పరిస్థితులకు పరమ ప్రయోజనకారి యనీ ఇటువంటి వివాహాలవల్లనే మన ఆశయం నెరవేరుతుందనీ, వర్ణవ్యవస్థ సమసిపోయి సామైక్యస్థితి విలసిస్తుందని రాధిక స్త్రీజాతి ప్రగతికి పునాదిరాయి వేసిందని, ఆమె చూపిన ఈ తెగువ మగవాళ్ళందరికీ ఆదర్శంకావలెనని ... ఇలా తమకు తోచిన అభ్యుదయ పదజాలమంతా ఉపయోగించి చాలా మంది ప్రసంగించారా సన్మాన సభలో.

సత్యంకు అక్కడ కూర్చుండ బుద్ధి కాలేదు. అతనికి కోపం చిరాకు, అసహ్యం ఒకేసారి కలిగాయి. వారి పొగడ్తలకు రాధికా రామం తగదు అనికాదు ఆ పొగడ్తలు చేసిన వారి వ్యక్తిత్వము తగినిదని. ఆ రోజు విమర్శించిన ఆవే నోళ్ళు ఈ రోజు హర్షిస్తున్నాయని.



ఎల్లప్పుడూ.....
టి. ఎన్. హెచ్. వారి
♦ సైనిక్స ♦ అర్. ఓ.
కలర్ బనీన్లనే
ఉపయోగించండి.

ఆంధ్రా మరియు ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

# ఎవరు త్యాగి?

* రచన: "ప్రవీణ్ సుశ్రీ" *

జీర్ణించాలడం లేదు. జీవితం చావనివ్వడం లేదు. జీవితం మీద ఆశ నేటి ధరల్లా రోజు రోజుకీ పెరిగిపోతూంది. కుచేల సంతానంలా ఏడుగురు. "రమేష్" పెద్దవాడు బి.ఎ. వరకు చదివాడు. ఉద్యోగాన్వేషణే వృత్తిగా పెట్టుకుని తిరుగుతున్నాడు. తర్వాత పెండ్లీడు కెదిగిన ఇద్దరాడపిల్లలు?... పెద్దవాడికైనా వుద్యోగం దొరికితే బావుణ్ణు! "ఎలా? ఎక్కడ?" ఏంచేయాలి? ఇదీ నిత్యం కుటుంబరావు మస్తిష్కంలో తుఫానులా తిరిగే ఆలోచన.

కుటుంబరావు రైల్వేలో పాయింట్సమెన్‌గా పనిచేస్తున్నాడు తను, భార్యా, ఏడుగురు, పిల్లలు వెరసి తొమ్మిది మంది. సంతానం పెద్దది. సంపాదన చిన్నది. అటుదిఇటు, ఇటుది అటు మారితే బావుండునేమో అని అన్పిస్తుంటుంది ఒక్కోసారి అతనికి. కుటుంబరావు పేరు సార్థకం చేసుకున్నాడు. ఏడుగురికి తండ్రియై. పత్రికల్లో అధిక సంతానంపై "కుటుంబరావు కార్టూన్లు" చాలా చూశాడు. అవన్నీ తన్ను చూసి వీళ్ళంతా గీసేస్తున్నారేమోనని తన అనుమానం ఒక్కోసారి కార్టూనిస్టులను తిట్టుకునేవాడు, కుటుంబ నియంత్రణ పాటించినా బావుండేది అని అనిపించేది.

రమేషు తర్వాత ఇద్దరాడపిల్లలు H.S.C. వరకూ చదివి. ఎవరిగోళ్ళు వాళ్ళు మాత్రమే గిల్లుకున్న వేగిల్లుకుంటూ కొంతకాలం గడి